

# తాడే పామయింది!

భగవంతుడికీ, మానవుడికీ ముఖ్యమైన భేదం ఒకటుంది. భగవంతుడు తన సృష్టికి భయపడడు. ఆయన తన సృష్టితో ఆడుకుంటాడు. కానీ మానవుడు తన సృష్టికి భయపడతాడు.

మారణాయుధాల్ని సృష్టించిన మానవుడు మరణానికి భయపడడం నిజంగా హాస్యాస్పదమే. కానీ అది నిజం. అన్నింటికంటె ఎక్కువగా మానవుడిని లొంగదీసుకున్నది డబ్బు. అది అతని సృష్టే కావచ్చు. కానీ దానికి అతడు బానిస.

అయితే నలుగురిలో గౌరవంగా బ్రతకడానికి డబ్బు ఒకటే చాలదు. అందుకోసమని మానవుడు కొన్ని ఆదర్శాలను సృష్టించుకున్నాడు. ఆ ప్రకారం నడుచుకుంటే తన జీవితం సాఫీగా నడుస్తుందని అతని ఉద్దేశ్యం కావచ్చు. కానీ, ఆదర్శాలను ఆచరించడం కష్టం. జీవితంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకుంటూ ఆదర్శాలను ఆచరించడమనేది ఎక్కడో మహాపురుషులకుగానీ సాధ్యం కాదు.

శంకరం, గోపాలం — వాళ్ళిద్దర్నీ మహాపురుషులని అనలేముగానీ వాళ్ళొక ఆదర్శానికి ఇరవై ఏళ్ళగా కట్టుబడిఉంటున్నారు. వాళ్ళిద్దరూ స్నేహితులు అని మామూలుగా చెప్పి ఊరుకుంటే, అనకాపల్లిలో అరవై ఇళ్ళవాళ్ళకేనా కోపం వస్తుంది. ఆ ఊళ్ళో పదిమంది విచిత్రంగా చెప్పుకునే వింతల్లో వాళ్ళిద్దరి స్నేహం సంగతి ఒకటి. శంకరానికీ, గోపాలానికీ శరీరాలు వేరుకానీ, మనసులు ఒక్కటేనని అంతా అనుకుంటూ ఉంటారు.

ప్రపంచంలో మనుష్యులు స్నేహంగా ఉండడం

ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. కానీ ఆ స్నేహం కొన్ని దశాబ్దాలుగా అంతరించకుండా ఉండటం, ఎందుకో ప్రజలు ఆశ్చర్యపోకుండా ఉండలేరు. తండ్రీకొడుకులమధ్య, భార్యాభర్తలమధ్య దశాబ్దాలుగా నిలవలేని స్నేహం ఆ ఇద్దరిమధ్యా నిలబడిందంటే అది ఆశ్చర్యపోవలసిన విషయం కాదని గట్టిగా అనలేమేమో!

విచిత్రమేమిటంటే వాళ్లిద్దరికీ ఎటువంటి బంధుత్వమూ లేదు. వాళ్ల కులాలుకూడా ఒక్కటి కాదు. ఇరవై ఏళ్లక్రితం ఉద్యోగరీత్యా ఇద్దరూ ఒకే ఆఫీసులో చేరారు. అక్కడే వారిద్దరికీ స్నేహం కలిసింది. అదే క్రమంగా నలుగురూ ఆశ్చర్యపడేటంత స్థాయికి పెరిగింది.

శంకరమూ, గోపాలమూ ఇద్దరూ సమవయస్కులు. ఇద్దరికీ నలభై దాటాయి. గోపాలానికి ముగ్గురు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా అయితే శంకరానికి ఇద్దరాడపిల్లలూ, ఒక మగపిల్లాడూను. గోపాలం పెద్దకొడుకు వాల్తేరులో యూనివర్సిటీలోనూ, చిన్నకొడుకు వాల్తేరులోనే ఇంజనీరింగూ, మూడోవాడు హైస్కూల్లో ఫోర్తుఫారమూ చదువుతున్నారు. ఆడపిల్లకు పద్నాలుగేళ్లు రాగానే పెళ్లి చేసేసి కొంచెం హాయిగానే ఉన్నాడాయన. శంకరం పెద్దపిల్లకు పెళ్లి చేశాడు. కొడుకు హైస్కూల్లో చదువుతున్నాడు. ఒక్క ఆడపిల్లకుమాత్రం పెళ్లి చెయ్యాలి ఆయన.

గోపాలానికి ఉద్యోగంతోపాటు వెనకాల ఎంతో అంతో ఆస్తి ఉంది. కానీ శంకరంమాత్రం లేనివాడనే చెప్పుకోవాలి. ఉద్యోగం ఒక్కటే ప్రస్తుతం ఆధారం ఆయనకు

తమ స్నేహం కలకాలం నిలవడంలోని రహస్యం శంకరానికీ, గోపాలానికీ ఇద్దరికీ తెలుసు. అసలా రహస్యం చాలామందికి తెలుసుగానీ ఆచరణలో పెట్టడమే కష్టసాధ్యమైన పని. అదేమిటంటే డబ్బుకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్తగా ఉండడం.

ప్రపంచంలో స్నేహితులమధ్య వైషమ్యాలు పెంచగల శక్తి కామినీ కనకాల కున్నదని మన పూర్వులు చెప్పనే చెప్పారు. కామిని జోక్యం అందరికీ ఉండకపోవచ్చు. కానీ కనకం జోక్యం లేనిదేమాత్రం ఏమీ కుదరదు. ఈ విషయం గ్రహించిన శంకరమూ, గోపాలమూ తమ స్నేహం బలపడిన మొదట్లోనే నిర్ణయించుకున్నారు, ఇద్దరూ ఒకళ్లదగ్గర ఒకళ్లు అప్పు చేసుకోకూడదని.

ఇద్దరూ కలిసి హోటలుకి వెళ్లేవారు. ఎవరి బిల్లు వారిదే. కలిసి సినిమాలు చూసేవారు. ఎవరి టిక్కెట్లు వారిదే. కలిసి బజారుకి వెళ్లేవారు. ఎవరి ఖర్చు వారిదే.

నాగరికత బాగా ప్రబలి, స్నేహితులకు హోటళ్లలో బిల్లులివ్వడమూ, బస్సులో టిక్కెట్లు కొనడమూ వగైరా ఫాషనుగా మారిన ఈ రోజుల్లో అలా ఉండడం నిజంగా చాలా కష్టమైన విషయం. కానీ గోపాలానిదీ, శంకరానిదీ ఒకటే వాదం. "నీకు దానం చేయాలనివుంటే ఒక పేదవాడికి ఇవ్వు. అంతేకానీ నీతోపాటు సమానుడైన ఒక వ్యక్తికి నువ్వు కాఫీ ఇప్పించడంలోనూ, సినిమాటిక్కెట్లు తీయడంలోనూ

> అప్పుకోసం స్నేహాలు పెంచుకోవడం చాలమందికి అలవాటు. కానీ మైత్రి అనే అమృతభాండంలో 'అప్పు' అనే విషబిందువు పొలుకుతుందని భయపడేవారూ కొందరుంటారు. కాని పరిస్థితుల వత్తిడికి తట్టుకోలేక విషపానం చేయక తప్పదు.

అర్థంలేదు. నీవు తీయకపోయినంతమాత్రాన ఆ వ్యక్తికి వచ్చే నష్టం లేదు. నీవు ఇచ్చినదానితో ఆ వ్యక్తికి వచ్చే లాభమూ లేదు. అదే ఒక పేదవాడికోసం ఖర్చుపెడితే అతని కో రోజు గడిచిపోతుంది. పేదవాడి కోసం ఖర్చుపెట్టే స్తోమతు లేదంటావా? ఉన్నవాడికిమాత్రం ఎలా ఖర్చుపెట్టగలవు?"

ఈ సమిష్టిఖర్చుల్లో ఇంకా చాలా నష్టాలున్నాయి. ఒక రోజున మనం ఒక స్నేహితుడి కోసం ఖర్చుపెట్టి మరునటిరోజు మన స్నేహితుడినించి ఖర్చు ఆశిస్తాం. దురదృష్టవశాత్తూ ఆ రోజు అతనివద్ద డబ్బు లేకపోతే మళ్లీ మనమే ఖర్చుపెట్టవలసివస్తుంది. ఒకొక్కప్పుడు మనం చెల్లించినప్పుడు బిల్లు ఎక్కువకావడమూ, స్నేహితుడు చెల్లించినప్పుడు తక్కువకావడమూ జరగవచ్చు. ఇవన్నీ యాథాలాపంగానే జరిగిపోయినా, వీటన్నిటి ప్రభావమూ మనసు మీద తప్పక ప్రసరించడమూ, అవసరమైనప్పుడు పెలికి రావడమూ జరగవచ్చు.

అప్పుచేసే దృష్టి మానుకోవడంవల్ల మరో ఉపయోగముంది. బజార్లో ఒకో వస్తువు ఒకొక్కప్పుడు మనని వెంటనే ఆకర్షిస్తుంది. జేబులో డబ్బుంటే వెంటనే కొనేయాలనిపిస్తుంది. దాని అవసరం ఎంతవరకూ ఉంది అనే ఆలోచన ఆ క్షణంలో కలగదు. పక్కన ఉన్న స్నేహితుణ్ని వెంటనే అప్పడిగి అది కొంటూండడం సాధారణంగా జరిగే సంగతి. అయితే ఏ పరిస్థితిలోనూ అప్పు చేయకూడదనేవాడికా వస్తువుని వెంటనే కొనడం సాధ్యంకాకపోవడంవల్ల దాన్ని గురించి కొంతవరకూ ఆలోచించడానికి సమయం దొరుకుతుంది. చూడగానే కలిగిన ఆకర్షణ మరి కొంతసేపటికి ఉండదు. ఈ విధంగా మధ్యతరగతి కుటుంబీకులకు ఈ ఆదర్శం కొంతవరకూ ఉపయోగిస్తుంది.

అవసరంలో ఆదుకునేవాడే స్నేహితుడనీ శంకరం, గోపాలంల ఆదర్శానికి అర్థంలేదనీ ఎవరైనా అంటే, అవసరమనే మాటకు డబ్బు అవసరం అనే అర్థం చేసుకున్నందుకు వాళ్లిద్దరూ తమ విచారాన్ని వ్యక్తం చేసేవారు.

ఈ ఆదర్శంతో శంకరం, గోపాలం స్నేహకాల రజతోత్సవంచేసుకోగలిగారు.కానీ మనిషి మనిషే;ఆదర్శం ఆదర్శమే! ఆదర్శానికి మార్పు ఉండదు. కానీ మనిషి ఒకేలా ఎంతోకాలం ఉండలేడు. అంతేకాదు, అవసరాలకూ ఆదర్శాలకూ బాగా దగ్గర సంబంధం ఉంది. అవసరం ఎక్కువైతే ఆదర్శానికి వ్యాఖ్యానాలు మారిపోవచ్చు. లేదా, ఆదర్శమే మారిపోవచ్చు.

హఠాత్తుగా శంకరానికి డబ్బు సమస్య వచ్చింది. అదీ ఎంటాకోటా సాధారణంగా మధ్యతరగతి కుటుంబీకులను గుల్లచేసే ఆడపిల్ల వివాహం! సంగతేమిటంటే శంకరం పుత్రికాదర్శానికి సంబంధం స్థిరపడింది.

శంకరం రెండో అమ్మాయి జానకి చాలా అందంగా ఉంటుందనే చెప్పాలి. కేవలం ఆ అమ్మాయి అందాన్ని చూసే ఒక ఇంజనీరు మాత పెళ్లిచూపులకి వచ్చి, సంబంధం స్థిరపరుచుకుంది. పిల్ల అందమే తమకు కట్నమనీ, కట్నం ఏమీ అవసరంలేదనీ అవిడ వ్రాకుచ్చింది. అయితే కట్నం తీసుకోకపోతే పాటివారిలో తమకు అవమానం కాబట్టి ఏవో వెయ్యినూటపదహార్లూ, వెండి మరచెంబూ వగైరా, నలుగురు ఆడబడుచులకు లాంఛనాలూ ఇచ్చి, వైభవంగా పెళ్లి జరిపిస్తే చాలునంది అవిడ.

శంకరం బ్రహ్మానందపడ్డాడు. నిజానికి అవిడ కోరింది చాలా స్వల్పం. సంబంధమూ గొప్పది. పిల్ల సుఖపడుతుంది. ఎటొచ్చీ ఆరేడు వేలు తనవి కావనుకుంటే సరి.

ఆరేడు వేలు అనే మాట మనస్సులో తట్టగానే ఉలిక్కిపడ్డాడు శంకరం. ఆరేడు వేలు ఉండడం కష్టంగానీ, తనవి కావనుకోవడం ఎంతసేపు!

స్వంత భూమిగానీ, స్వంత ఇల్లుగానీ ఉంటే ఆయన తప్పక అమ్మిఉండేవాడు. దురదృష్టవశాత్తూ అటువంటివేమీ లేవాయె. కూతురి పెళ్లికోసమని ప్రత్యేకంగా బాంకులో వేసిన నిలవ సుమారు వెయ్యి రూపాయలుంటుంది. ఇంట్లో నగానట్రా సొగుచేస్తే మరో వెయ్యి కాకపోదు. మరి తరవాత . . .

ప్రావిడెంటుఫండులో డబ్బు కొంత అప్పుమీద తీసుకోవచ్చు. అయినా అది ఏ మూలకి?

అప్పుడే ఆయన మదిలో ప్రవేశించింది అప్పు అనే మాట. 'అప్పు చేయాలి, అప్పు చేయాలి' అనుకున్నాడాయన.

ఆ ఆలోచనతోపాటు ఆయనలో బాధకూడా కలిగింది. జీవితంలో దేనికైతే దూరంగా ఉండాలను కున్నాడో, ఏ ఆదర్శానికి అంటుకుని ఉండాలనుకున్నాడో అదే ఇప్పుడు దగ్గరై తనకు ఆధారమయింది. ఆదర్శానికి కట్టుబడి ఈ పెళ్లి మానుకుందామా అనుకుంటే, ఎప్పటికైనా తనకీ కష్టం తప్పదు. అప్పును ఆశ్రయించడం తనకు ఎప్పటికైనా తప్పదు. అటువంటప్పుడు ఇప్పుడే ఆశ్రయించి ఈ బంగారం లాంటి సంబంధాన్ని నిలబెట్టుకోవాలి.

ఆదర్శాన్ని త్యాగంచేసి అప్పు చేయాలనే నిర్ణయానికి వచ్చాక శంకరం అసలు లోకంలోకి వచ్చాడు. ఇంతసేపూ తన కెవరో అప్పిస్తానంటున్నట్లూ, తను తీసుకోవడమా, మానడమా అని సందిగ్ధంలోపడ్డట్లూ ఆలోచించాడు. కానీనిజంగా తనకిప్పుడు అప్పెవరిస్తారు? ఇచ్చినా ఏం చూసి ఇస్తారు? ఈ ఇంటిమీదగానీ, ఈ పొలంమీదగానీ తనఖా రాయించుకుంటూ దనుకునేందుకు తన కేముందని?

అయినా ఆయన ఒకరిద్దరిని అడిగి చూశాడు.

వసుంధర

వాళ్ళు నిర్మొహమాటంగా పోమీ అడిగారు. ఏమీ పోమీ చూపించలేని ఆయనకు మొండిచెయ్యే ఎదురయింది. అయినా ఆయన ప్రయత్నలోపం లేకుండా మరికొంతమందిని అడిగాడు. అందులో ఒకాయన, "చెట్టంత స్నేహితుడు గోపాలముండగా మమ్మల్ని పట్టుకుని వెళ్లాడుతా వెందుకయ్యా!" అని వేళాకోళం చేశాడు.

శంకరం ఉలిక్కిపడ్డాడు. ఉలికిపాటుతోపాటు ఆయనకు వణుకుకూడా కలిగింది. నిజమే, గోపాలం తనకు స్నేహితుడే— చెట్టంత స్నేహితుడే! కానీ దీనివల్లయితే ఆ చెట్టంతస్నేహం కూలిపోవచ్చునే! అదే తను చేయాలి!

శంకరం బాగా ఆలోచించాడు. స్నేహితుడివద్ద అప్పు చేయకూడదన్న ఆదర్శం మంచిదే. కానీ అవసరానికి అక్కరకురాని స్నేహం ఉండిమాత్రం ప్రయోజనమేమిటి? కూతురిపెళ్లి శంకరాన్ని కొత్తమార్గాలలో ఆలోచింపజేసింది.

అసలు స్నేహితులంటే ఎవరు? స్నేహం ఉద్దేశ్యమేమిటి? ఒకరి నొకరు కష్టసుఖాల్లో ఆదుకుంటూ ఉండేవారే ఆయనకు స్నేహితులనిపించింది. అంతేకాదు, ఇంతకాలమూ తమ స్నేహం నిస్సారంగా కొనసాగిపోయినట్లూ, అసలు నిజమైన స్నేహానికి ఈ క్షణంలోనే పునాది పడబోతున్నట్లూ ఆయనకు అనిపించింది.

ఈ ఆలోచనల పర్యవసానంగా ఆయన గోపాలం వద్ద అప్పు చేయడానికి నిర్ణయించుకున్నాడు. కానీ నిర్ణయించుకున్న రెండుమూడు రోజులవరకూ ఆ విషయాన్ని ఆచరణలో పెట్టలేకపోయాడు. చివరికి ఓ రోజు గోపాలందగ్గిర మెల్లిగా కూతురి పెళ్లివిషయం ప్రస్తావించాడు.

"విన్నాను, చాలా సంతోషించాను. అమ్మాయికి చాలా చక్కని సంబంధం కుదిర్చావు. ఎలాగైనా అసాధ్యుడివోయ్ నువ్వు, శంకరం" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"నిజమేననుకో. కానీ పెళ్లికి డబ్బు కూడబెట్టడం కూడా అసాధ్యంగానే ఉంది నాకు. నీకు తెలియందేముంది, గోపాలం!" అన్నాడు శంకరం గుంభనగా.

గోపాలం భ్రుకుటి ముడతలు పడింది. శంకరం డబ్బు కిబ్బందిపడుతూన్న సంగతి ఆయనదాకా రాకపోలేదు. పైగా, ఆయన ఒకరిద్దరు ఎరిగున్నవాళ్ళ విమర్శలకి గురిఅయ్యాడుకూడా. "ఏమిటో పెద్ద స్నేహితుణ్నంటావు. శంకరం ఎక్కడా అప్పు పుట్టక చస్తున్నాడు. కాస్త సహాయం చేయలేవూ? ఆ మాత్రం తాణ లేదా నీకు" అని వాళ్ళు అన్న మాటలు గోపాలంమీద బాగా పనిచేశాయి.

ఆయన ఆలోచనలుకూడా శంకరం ఆలోచనల దారిలోనే నడిచాయి. అప్పు చేసినంతమాత్రాన విడిపోతామేమోనసుకుని భయపడే తమ స్నేహమూ ఒక స్నేహమేనా అనిపించిం దాయనకు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, చలించకుండా నిలబడేదే నిజమైన స్నేహం! తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి స్నేహం ఉన్నా ఒకటే, ఊడినా ఒకటే. తమ స్నేహాని కిప్పు డొక పరీక్ష వచ్చి అంది. పరీక్షను తాము ధైర్యంగా ఎదుర్కోవాలి.

తనకు తోచినమేరకు నాలుగైదు వేలు శంకరానికి సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు గోపాలం.



కొండా కోనా (అబూ పర్వత శిఖరం) ఫోటో— కె. రామకృష్ణారావు (చిత్తరంజన్)

అయితే ఆయనకు ఒక్కటే సమస్య వచ్చింది, శంకరం అప్పు తీసుకుంటాడా అని. తనంతట తానుగా అడిగి ఇవ్వడం శంకరాన్ని చిన్నబుచ్చిన ట్లవుతుందేమోనని ఆయనకు అనుమానం. ఈ ఉద్దేశ్యంతోనే మెదలకుండా ఊరుకున్న ఆయనకు ఇప్పుడు చక్కని అవకాశం వచ్చింది. వెంటనే అనేశాడు. "నువ్వు మరోలా అనుకోనంటే, శంకరం!" ... అని ఆగాడు ఆయన. "జానకి నీ కూతురేకాదు, నా కూతురుకూడాను. జానకి పెళ్లివిషయంలో నీ కున్నంత బాధ్యత నాకూ ఉంది. కాబట్టి ఓ అయిదు వేలు కనీసం అప్పుగానైనా తీసుకోపోతే నేను చాలా బాధపడవలసిఉంటుంది . ."

గోపాలాన్ని ఎలా అప్పు అడగాలా అని ఆలోచిస్తున్న శంకరానికి పని సులభమైంది. కృతజ్ఞతతో ఆయన కళ్ళు ఆర్ద్రమైనాయి. "గోపాలం, నువ్వు నాకు స్నేహితుడివికాదు, దేవుడివి!" అన్నా డాయన.

"ఛా అవేం మాటలు. ఊరుకో!" అన్నాడు గోపాలం.

జానకి పెళ్లి వైభవంగా జరిగిపోయింది. శంకరం, గోపాలంల స్నేహాన్ని గురించి ఆ ఊళ్లో మరోసారి అంతా చెప్పుకున్నారు. కానీ ఆనాటినుంచీ శంకరం, గోపాలంల దినచర్యల్లోమాత్రం కొన్ని మార్పులు సంభవించాయి. శంకరానికి గోపాలంపట్ల సమభావం పోయి ఒక విధమైన కృతజ్ఞతాభావం ఏర్పడిపోయింది. ప్రతిరోజూ మాటల సందర్భంలో తన కృతజ్ఞతా భావాన్ని ఏదో ఒక సమయంలో వ్యక్తపరుస్తుండే వాడు. అది గోపాలానికి చాలా బాధగా ఉండేది. తమ స్నేహంమధ్య ఏదో అడ్డు నిలిచినట్లుగా ఆయన బాధపడేవాడు. శంకరంలోని ఈ భావాన్ని పోగొట్టాలని ఆయన శతధా ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఆఖరికి ఒక రోజున ఆయన అన్నాడు: "ఎందుకు, శంకరం, పస్తూరికే ఆకాశానికి ఎత్తేస్తావు? నేనేమన్నా ఊరికే ఇచ్చానా ఏమిటి, అప్పుగా ఇచ్చాను. అదీ ఒక పెద్ద విషయమేనా?"

అలా అనడంలో గోపాలానికి దురుద్దేశ్యం ఏమాత్రమూ లేదు. తను చేసినది గొప్ప విషయం కాదని శంకరానికి చెప్పాలనే ఆయన తాపత్రయం. అయితే ఈ మాటలు శంకరానికి మరోకలా అర్థమయి అతని మనస్సు చివుక్కుమంది.

అలా అనడంలో గోపాలం ఉద్దేశ్యమేమై ఉంటుంది? గోపాలం ఇచ్చిన డబ్బును ఎగవేద్దామనే ఉద్దేశ్యంతో తనిలా ముఖస్తుతి చేస్తున్నాడనే అభిప్రాయమా? లేక, అప్పుగా ఇచ్చాను మరిచిపోతున్నావు, తొందరగా తీర్చాలిసుమా అన్న హెచ్చరికా? లేక, నిజంగా తను చేసింది గొప్ప విషయంకాదని చెప్పానా?

మనసు మంచిదని అనలేము. ఎందుకంటే ఒక విషయానికి నాలుగైదు రకాల కారణాలు లభించినప్పుడు, అది ఉన్నంతలో కాస్త చెడ్డదిగా కనిపించే కారణాన్నే నమ్మడానికి ప్రయత్నిస్తుంది. అంతమందికీ మనసలా ఉన్నా లేకపోయినా శంకరం మనస్సుమాత్రం అలాంటిదే అనడంలో సందేహమేమీ లేదు.

అనుమానం పెనుభూతంవంటిది. గోపాలం దృష్టిలో తను లోకువైపోయాడన్న అనుమానం శంకరంలో మొలకెత్తింది. లేకపోతే కృతజ్ఞతను ప్రకటించుకోవడం తప్పా? దానికి పెడర్థాలు తీస్తాడా? అదే — తను ఏమీ మాట్లాడకుండా ఊరుకుని ఉన్నట్లయితే, "చూశావా? మాటవరసకైనా అనలేదు. మనుష్యులకి కృతజ్ఞత ఉండదు" అని పదిమంది వద్దా అనడూ? అనలింతకూ పొరపాటు తనది. తను అప్పు చేశాడు. తనది కిందిచెయ్యి!

ఒక ప్రాణస్నేహితుణ్ని గురించి శంకరం ఇలా ఆలోచించడం చాలామందికి అసహజంగా కనిపించ

